రెవెన్యూలో రీ సర్వే చారిత్రాత్మకం

- బ్రిటిష్ కాలం నాటి రికార్డులు మార్పు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



భూ రీసర్వే పూర్తయిన వారికి ఎల్‌పీఎం పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే , ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడేపల్లి రూరల్ : రెవెన్యూ శాఖలో భూ రీసర్వే అనేది ఓ చరిత్ర అని, బ్రిటిష్‌కాలం నాటి రికార్డుల్ని మార్చి మరలా ప్రతి రైతుకూ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మెంబర్) నంబర్‌తో పాసు పుస్తకాలు అందించడం దేశ చరిత్రలోనే నిలిచిపోతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేరును సువర్ణాక్షరాలతో లిఖించవచ్చని తెలిపారు. దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం రీ సర్వే పూర్తయిన గ్రామాలైన తుమ్మపూడి, మోరంపూడి రైతులకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలతో కలసి ఎల్‌పీఎం పాసు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా 1903లో బ్రిటిష్ కాలం నాటి రికార్డులే ఇప్పటి కూడా రెవెన్యూ శాఖలో వినియోగిస్తున్నారు. ఈ రికార్డుల కారణంగా అనేక సమస్యలు ఏర్పడి రైతులు, నివాసదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న శాశ్వత భూహక్కు , భూ రక్ష పథకం కింద తుమ్మపూడిలో 1506 మంది రైతులకు, 1410.27 ఎకరాల భూమిని, మోరంపూడిలో 1498 మంది రైతులకు 1124.32 ఎకరాల భూమికి సంబంధించి ల్యాండ్ పార్సిల్ నంబర్‌తో కూడిన పాస్ పుస్తకాలను అందజేశామని వివరించారు. అసైన్డ్ భూముల్లో 20 సంవత్సరాలు పైబడి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలు పోషించుకుంటున్న వారిని 22ఎ జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. తుమ్మపూడి, శృంగారపురానికి చెందిన 23 మంది రైతులకు ఎల్‌పీఎం నంబర్ కలిగిన పాసు పుస్తకాలను అందజేస్తున్నామని తెలిపారు. గుంటూరు జిల్లాలో మొట్టమొదటగా దుగ్గిరాల మండలాన్ని ఎంచుకుని, ఇప్పటికే ఏడు గ్రామాల్లో బ్రిటిష్ కాలం నాటి రికార్డుల్ని మార్చి కొత్తగా వాటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి రైతుకు ఎల్‌పీఎం నంబర్‌ను అందజేసి యూనిక్ కోడ్‌తో పాసు పుస్తకాలను అందజేస్తున్నామని వెల్లడించారు. దీంతోపాటు గ్రామ కంఠాల్లో ఉన్న నివాసదారులకు కూడా రీ సర్వే నిర్వహించి, ఇంటికి సంబంధించిన అన్ని రకాల పత్రాలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలియజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీవో వీరయ్య, సర్వేయర్ గోపాలరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, పెనుమూలి ఎంపీటీసీ సభ్యుడుఉ యస్‌కె. మహబూబ్ హున్నీసా, సర్పంచులు కొండూరు సుధారాణి, షేక్ అజీజున్, గంపల గంగాధరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వడ్డేశ్వరపు రజనీకాంత్, దుగ్గిరాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు శృంగారపాటి రత్నం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు వీరయ్య పాల్గొన్నారు.

పెద కోనేరు పనులు వేగవంతం చేయాలి

మంగళగిరి: నగరంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ కళ్యాణ పుష్కరణి(పెదకోనేరు) అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. శనివారం పెదకోనేరులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ 500 సంవత్సారాల చరిత్ర కలిగిన పెదకోనేరు పునర్నిర్మాణ పనులు ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందన్నారు. పెద కోనేరుకు పూర్వవైభవం తీసుకువచ్చి కోనేరులోని నీటితో స్వామివారికి అర్చన అభిషేకాలు నిర్వహించేలా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. రూ 1.50 కోట్లతో చేపట్టిన పనులు త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా సామూహిక సత్యదేవ వ్రతం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సోలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ మందిరంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఆలయ మండపంలో వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతం, పూజల్లో 120 జంటలు పాల్గొన్నాయి. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు వై.యల్లారెడ్డి పర్యవేక్షించారు.

ఆరోగ్యశ్రీలో విస్తృత వైద్యసేవలు




ఫిరంగిపురం: ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల జబ్బులకు వైద్యసేవలు అందుతాయని వైద్యురాలు ఎస్తేరురాణి చెప్పారు. మండలంలోని సచివాలయ-2 పరిధిలోని అల్లంవారిపాలెంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 79 మంది రోగులకు పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న రోగుల వద్దకు వెళ్లి, పరీక్షలు చేసి తగిన సూచనలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లో విద్యార్థులకు శారీరక, ఎత్తు, బరువు, రక్త నమూనా పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌వో గోవర్ధన, ఏఎస్‌ఎం మాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



వడ్డమాను(తాడికొండ): సమగ్ర ఎరువులు, పురుగు మందుల వాడకం, యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని తుళ్లూరు మండల వ్యవసాయాధికారి శ్రీ రంజని తెలిపారు. తుళ్లూరు మండలం వడ్డమానులో శనివారం నిర్వహించిన పొలంబడిలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యవంతమైన నారు పెంపకంతో పాటు మిత్ర పురుగుల్ని సంరక్షించుకోవాలని సూచించారు. ప్రతి వారం పొలం పరిసరాల్ని విశ్లేషణ చేయాలని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాల్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సాగులో మెలకువలతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వడ్డమాను గ్రామ వ్యవసాయ సహాయకులు టి. సాయిసుందర్, బుర్రా రామకృష్ణారెడ్డి, వెంకట శివారెడ్డి, చుండు వెంకటరెడ్డి, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రగ్బీ జాతీయ జట్టుకు నూతక్కి విద్యార్థుల ఎంపిక



నూతక్కి(మంగళగిరి): నగర పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. గత నెల 21 నుంచి 24 వరకు కర్నూలులో 67 వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు నిర్వహించారు. అండర్ -17 జట్టుకు పదో తరగతి విద్యార్థి ఎస్‌కే. హర్షిద్, అండర్ -14 జట్టుకు అంకరంశెట్టి శ్రీలక్ష్మి, దాసరి షారోన్ కృపావల్లి ఎంపికయ్యారని శనివారం పీడీ రజనీ నాయక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్ని నూతక్కి సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఈవో శ్యామ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మజ అభినందనలు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

ముక్కోటికి సిద్ధమవుతున్న నారసింహుడు

ఈ నెల 5న సమన్వయ సమావేశం

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ముక్కోటి ఉత్సవానికి సిద్ధమవుతున్నారు. జనవరి 23న తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న భక్తులకు ఏర్పాట్లుపై అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఏటా ముక్కోటి ఉత్సవానికి 80వేల నుంచి లక్ష మంది తరలివచ్చి స్వామిని దర్శించుకుని, బంగారు శంఖు తీర్థం స్వీకరిస్తారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అధికారులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేయనున్నారు.

బీఎల్‌వోలంతా అందుబాటులో ఉండాలి



గుడ్‌న్యూస్ స్కూలులో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులు

కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి

తాడేపల్లిరూరల్ : బీఎల్‌వోలు తమకు కేటాయించిన కేంద్రాల్లో ఉండి ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 6,7,8లను సేకరించాలని కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. ఆయన శనివారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కనకదుర్గ వారధి రేపల్లె కరకట్ట వెంబడి ఉన్న గుడ్‌న్యూస్ స్కూలులో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపైన్ డేను పరిశీలించారు. ఎంత మంది ఓటర్లు తమ పేర్లు సరి చూసుకున్నారు? ఎన్ని క్లెయిమ్స్ వచ్చాయి? మార్పులకు వారు ఇచ్చిన దరఖాస్తుల వివరాల్ని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వో రిజిస్టర్, వారి వద్ద ఉన్న 6,7,8 ఫారాల్ని పరిశీలించి సూచనలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లు జాబితాలో పేర్లను సరి చూసుకుని ఓటు హక్కును పొందేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్‌వో లక్ష్మీకుమారి, ఏఈఆర్‌వో, తాడేపల్లి డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సూపర్‌వైజర్ వెంకటకృష్ణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రతి పౌరుడి నైతిక బాధ్యత

మంగళగిరి: ఓటుహక్కు ప్రతి పౌరుడి నైతిక బాధ్యతని నగర ఎలక్టోరల్ ఆఫీసర్లు తహసీల్దార్ జి.వి.రామ్‌ప్రసాద్, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె. హేమమాలిని తెలిపారు. నగర పరిధిలోని పోలింగ్ బూత్‌లలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపుల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా నమోదైన ఓటర్లు తమ పేరు ఉందో లేదో చూసుకోవాలని, తప్పులుంటే సరి చేసుకోవాలని సూచించారు. ఆదివారం కూడా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఓట్లను సరి చూసుకోవాలని కోరారు.

ఓట్ల నమోదుపై వినూత్న ప్రచారం

తాడేపల్లి రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓట్ల నమోదుపై రెవెన్యూ అధికారులు వినూత్నంగా ప్రచారం చేస్తూ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. నేను ఓటరుగా నమోదు అయ్యాను.. మీరు కూడా నమోదు అయ్యారా అంటూ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను తాడేపల్లి రూరల్ ఏఈఆర్‌వో, తహసీల్దార్ నాగిరెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ సూచనల మేరకు కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ సతీష్, ఆర్‌ఐలు వంశీ, ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ దిగజారుడు వ్యాఖ్యలు సిగ్గుచేటు

- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్
- నీటి హక్కుల కోసం ప్రభుత్వం పోరాటం
- ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని బాబు తప్పుడు కథనాలు



తాడికొండ: విభజన అనంతరం ఏపీ- తెలంగాణ మధ్య నడుస్తున్న నీటి లభ్యత హక్కులు, వాటాల విషయంపై ప్రభుత్వం పోరాడుతుంటే తెలుగు దేశం పార్టీ నాయకులు దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఖండించారు. గుంటూరులోని భారత్‌పేట నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో సాగు, తాగునీరు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే టీడీపీ నాయకులకు అది హాస్యాస్పదంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ వాటా కింద నీటిని విడుదల చేయడంలో తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయానికి హర్షించాల్సింది పోయి.. ప్రతి పక్ష పార్టీలకు ఎల్లో మీడియా బాకాలూదడం వారి అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటిపై పోరాడాల్సిన ప్రతిపక్షం ప్రజల నెత్తిన గుదిబండగా మారడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్న చంద్రబాబు ప్రభుత్వ వాటా కింద రావాల్సిన నీటి హక్కుల్ని వదిలేసి తెలంగాణ ప్రభుత్వం కాళ్లు పట్టుకున్నాడని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రం, రైతుల ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముందడుగు వేస్తుంటే గగ్గోలు పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ ప్రతి విషయాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందాలని బాబు చేస్తున్న కుయుక్తులు చూసి రాష్ట్ర ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు, ఇతర ఎన్ని పార్టీలు కలసి ఎన్నికలకు వచ్చినా రాష్ట్రంలో 175/175 సీట్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనమైన విజయం సాధించి సీఎంగా జగనన్న మరోసారి పాలన సాగించడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

చెరువు స్థలం వివాదంపై ప్రభుత్వానికి నివేదిక

తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



యర్రబాలెం చెరువును పరిశీలిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం చెరువును శనివారం తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పరిశీలించారు. చెరువు స్థలం కోర్టు వివాదంలో ఉన్న నేపథ్యంలో ఆమె సందర్శించారు. స్థలం వివాదంపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.వి.రామ్‌ప్రసాద్, ఆర్ఐ సాంబశివరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నగరంలో యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో ఈ నెల 6న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఓ వివాహ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో తెనాలి కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దార్ జి.వి.రామ్‌ప్రసాద్, రూరల్ సీఐ భూషణం, ఎస్ఐ క్రాంతికుమార్ ఏర్పాట్లను పరిశీలించారు.

మద్యం మత్తులో యువతిపై యువకుడి దాడి

ఆసుపత్రికి తరలించిన తాడేపల్లి పోలీసులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యానాదుల కాలనీలో నివాసముంటూ సహజీవనం చేస్తున్న యువతి, యువకుడి మధ్య ఏర్పడిన వివాదం శనివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరింది. అక్కడ కూడా మద్యం మత్తులో గొడవపడి యువతిపై యువకుడు బ్లేడ్‌లాంటి ఆయుధంతో దాడి చేయగా గాయపడింది. పోలీసులు ఆ యువతిని వైద్య నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం... కర్ణాటకకు చెందిన పోలా కిరణ్, బుజ్జి కొంతకాలం కిందట అక్కడ నుంచి వచ్చి విజయవాడలో నివాసముంటూ సహజీవనం చేస్తున్నారు. నెల రోజుల కిందట నివాసాన్ని తాడేపల్లి యానాదుల కాలనీకి మార్చారు. ఇద్దరికీ మద్యం అలవాటు ఉందని, కిరణ్ బుజ్జి సంపాదన మీదే ఆధారపడడంతో ప్రతిరోజూ గొడవపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి ఇద్దరూ కొట్టుకున్నారని, ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన అనంతరం ఇద్దరూ గొడవపడుతున్నప్పటికీ అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఉద్రేకంలో ఉన్న కిరణ్ బుజ్జిపై బ్లేడ్ లాంటి ఆయుధంతో దాడి చేశాడు. వెంటనే తేరుకున్న పోలీసులు గాయపడిన బుజ్జికి ప్రథమ చికిత్స చేశారు. ఇదే సమయంలో కిరణ్ అక్కడ నుంచి చల్లగా జారుకున్నాడు. ప్రస్తుతం బుజ్జి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని, జరిగిన సంఘటనపై ప్రాథమిక విచారణ చేసి కేసు నమోదు చేయనున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలి

కాకినాడ ఎస్పీ సీహెచ్.విజయరావు



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ విజయరావు

తాడేపల్లి రూరల్: మహనీయుల్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని కాకినాడ ఎస్పీ సీహెచ్.విజయరావు తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో శనివారం సమతావాది, బాబూజీ మాదిగ రైట్స్ ప్రొటెక్షన్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, జగ్జీవన్‌రావు, గుర్రం జాషువా విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాకినాడ ఎస్పీ విజయరావు, రాజమండ్రి జిల్లా జడ్జి ఎం.నాగేశ్వరరావు పాల్గొని, విగ్రహాలను ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటే జీవితాల్లో మార్పు వస్తుందని, అంబేడ్కర్, జగ్జీవన్ రావు, గుర్రం జాషువాలు సంఘ సంస్కర్తలు అయ్యారని చెప్పారు. తాను చదువుకుంటున్న రోజుల్లో అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల్ని పాటించానని తెలిపారు. కార్యక్రమంలో విగ్రహాల కమిటీ అధ్యక్షులు బి.ప్రసన్నకుమార్, ఆర్.రాంబాబు, పచ్చల రాజారావు, వి.కిశోర్, ఎం.వినోద్‌బాబు, అద్దెపల్లి గణపతి, బి.నాగేశ్వరరావు, బి.పురుషోత్తం పాల్గొన్నారు.

రైతులంతా అప్రమత్తంగా ఉండాలి: ఏడీఏ

మంగళగిరి: తుపాను ప్రభావంతో అధిక వర్షాలు కురవనున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీఏ గాయం శ్రీనివాస్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ముఖ్యంగా వరి గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉంటే సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి కోసుకోవాలని సూచించారు. వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో వర్షంలో తడవకుండా ఆరబెట్టుకోవడంతో పాటు టార్పాలిన్, పాలిథీన్ పట్టాలను పూర్తిస్థాయిలో అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. వరి కోసిన చేలల్లో తక్షణమే పనల్ని కట్టి కుప్పలు పోసి, పంట తడవకుండా చూడాలని తెలిపారు. మెట్ట పంటలు అయిన పత్తి, మిరప చేలల్లో వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. పత్తి తీతకు వస్తే వెంటనే తీసి వర్షానికి తడవకుండా కాపాడుకోవాలని చెప్పారు. మిరపను కోసి అధిక వర్షం నుంచి కాయలు తడవకుండా, బూజు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం తగ్గిన తర్వాత బ్లైటాక్స్, పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలని చెప్పారు.

ఆరోగ్యశ్రీ సేవలపై కరపత్రాల ఆవిష్కరణ



తాడేపల్లి రూరల్ : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై లభించే సేవల గురించి ప్రజలకు అవగాహన కోసం శనివారం తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పి. కాంతకుమారితో పాటు సిబ్బంది కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టారన్నారు. ఇందులో పలు వైద్య సేవలు ఉచితంగా లభిస్తున్నాయని, ప్రజలంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో గురుకుమార్, ఆరోగ్యశ్రీ టీమ్ లీడర్ శెట్టి బాలస్వామి, ఆరోగ్యమిత్ర కె. సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ కె. శ్రీనివాసరావు, రమాదేవి, ఎ. శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ



మోతడక(తాడికొండ): నానాటికీ పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్య సమస్యను మొక్కల పెంపకం ద్వారా నియంత్రించవచ్చని తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కిరణ్ కుమార్ తెలిపారు. జాతీయ కాలుష్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వస్తున్న మార్పుల కారణంగా పర్యావరణ కాలుష్యం పెరిగి జీవన నాణ్యత దెబ్బతిని, ఆరోగ్యాల్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. దీన్ని నియంత్రించేందుకు విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం అలవర్చుకోవడంతో పాటు పలువురికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో పలువురు అధ్యాపకులతో కలసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. నాగ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ డి. శంకరరావు, ఐఐసీ కో- ఆర్డినేటర్ శాంతిప్రియ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో వైద్యురాలిగా శ్వేత బాధ్యతల స్వీకరణ



ఫిరంగిపురం: స్థానిక పీహెచ్‌సీ సెక్టార్ రెండో వైద్యురాలిగా ఎం.శ్వేత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వైద్యురాలు బ్యూలాను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖకు సరెండర్ చేశారు. కాగా ఇటీవల నూతనంగా వైద్యుల్ని తీసుకున్నారని, దానిలో భాగంగా శ్వేత బాధ్యతలు స్వీకరించినట్లు పీహెచ్‌సీ సెక్టార్ వైద్యురాలు పి.ఎస్తేరురాణి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండ: మోతడక సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఫీడర్ పరిధిలోని నిడుముక్కల, మోతడక, లచ్చన్నగుడిపూడి, ముక్కామల, బేజాత్పురం, రావెల, పాములపాడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా ఈ అసౌకర్యాన్ని గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

అధికారులంతా అందుబాటులో ఉండాలి

తాడేపల్లి రూరల్ : తుపాను హెచ్చరికలో నేపథ్యంలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. తుపాను ప్రభావం గుంటూరు జిల్లాలో ఉందని, ప్రతి గ్రామంలోనూ వీఆర్వోలు, వీఆర్ఏలు, ఇతర అధికారులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి అందించాలని ఆదేశించారు. సలహాలు, సహాయాలు కావాలంటే 9908568006ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కులగణన చారిత్రాత్మక నిర్ణయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నెహ్రూనగర్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టడం చారిత్రాత్మకమైన నిర్ణయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. శనివారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో బీసీ కుల జనగణనపై, రాజకీయ భవిష్యత్తుపై కార్యాచరణకై వివిధ బీసీ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులగణన చేపట్టాలని ఎన్నో సంవత్సరాలుగా కేంద్రాన్ని కోరుతున్నప్పటికీ ఫలితం లేదన్నారు. కాని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. రాష్ట్రం చేపట్టే కులగణనను కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి రాజకీయ పార్టీ బీసీలకు ప్రతి పార్లమెంట్ స్థానంలో మూడు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలో బీసీల గళం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసేందుకు లక్షలాది మంది బీసీలతో మహాసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, నాయకులు పారేపల్లి మహేష్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, తన్నీరు ఆంజనేయులు, కొల్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.

పసుపు వేలము ప్రకటన

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నందు ఈ దిగువ తెల్పిన రైతులు పసుపును హామీగా వుంచి ఋణము పొందియున్నారు. వారి యొక్క ఋణము వాయిదా మీరినది. వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు ఇచ్చిననూ ఋణము చెల్లించనందున వారి యొక్క పసుపును ఈ దిగువ ఉదహరించిన విధముగా సహకార సంఘముల చట్టం ప్రకారము వేలము వేయబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ది.07-12-2023 ఉదయం 11.00 లకు, దుగ్గిరాల గ్రామములో

S.No	G.No.	NAME	L.No.	QTS	DATE OF DISBURS	AMOUNT	STOCK PLACE
1	5387	ఉన్నవ లరుణాదేవి భర్త కోటేశ్వరరావు-రేపల్లె	822	78	24.05.2016	365000	సెంట్రల్ వేర్ హౌస్ దుగ్గిరాల
2	3468	వర్ధమూడి శివశంకరరావు తండ్రి రంగయ్య-కనిగంటివారిపాలెం	1015	200	29.03.2019	1000000	సెంట్రల్ వేర్ హౌస్ దుగ్గిరాల
3	896బి	బుల్లా మరియదాసు తండ్రి సుబ్బారావు-కుంచనపల్లి	1645	265	26.06.2020	980000	[illegible] దుగ్గిరాల
4	738బి	బుర్రముక్కు శ్రీనివాసరెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి-కుంచనపల్లి	1647	287	30.06.2020	1000000	[illegible] దుగ్గిరాల
5	905బి	కోలంటి శేషు తండ్రి నాగేశ్వరరావు-కుంచనపల్లి	1665	270	15.07.2020	980000	[illegible] దుగ్గిరాల

షరతులు : 1) పాటలో పాల్గొనవలసిన వారు వేలము సమయమునకు ముందుగా రూ.5000/-లు ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. 2) పాట పాడుకున్న వారు సొమ్ము రూ.500000/-అదేరోజున చెల్లించి మిగిలిన మొత్తమును సరుకును స్వాధీనపరుచుకున్నరోజున చెల్లించవలెను. 3) పాటను జరుపుటకు మరియు నిలుపుదల చేయుటకు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసరు గారికి పూర్తి అధికారము ఉన్నది. 4)పూర్తివివరముల కొరకు సంఘ ఆఫీసు పనివేళల యందు సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు గారిని సంప్రదించవలెను.

సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, PACS, భట్టిప్రోలు